# 3

# వరుసలు

ఈమధ్య పెళ్లి ముహూర్తాలన్నీ ఉదయమే పెడ్తున్నారు. దీనివల్ల ఎవరికీ యిబ్బంది లేదు. ఇంటి వద్దే స్నానాలవీ ముగించుకొని వచ్చి పెళ్ళి అవడంతోనే భోంచేసి ఎక్కడివాళ్ళక్కడికి వెళ్ళిపోవచ్చు. ఏమ్మాట్లాడుకున్నా భోజనాలయ్యే దాకనే. తర్వాత పెళ్ళి పందిరి ఖాళీ.

వరుసకు అన్న కూతురి పెళ్ళి. అందుకని చాలా మంది పాతచుట్టాల్తో పరిచయాల్ని రెన్యువల్ చేసికోవాలని ఉదయమే లేచి స్నానాలవీ ముగించి గబగబా తయారై అందరం బస్సెక్కాం. తార్రోడ్డు మీద సాఫీగా వెళ్తోంది బస్సు. పూర్వం ఆ వూరికి ఏవైపు నుండి తోవ సరిగ్గా వుండేది కాదు. అమ్మమ్మతో చిటికనవేలు పట్టుకొని గంటన్నర పరుగులాంటి నడకతో ఆ వూరు చేరేసరికి ఒక్క కాలివేలుకన్నా పసుపు అద్దాల్సి వచ్చేది. చెప్పులు లేని కాళ్ళకు తోవలో అన్నీ గులకరాళ్ళు, దెబ్బలు.

ఆ వూరు మా అమ్మమ్మగారి పుట్టినిల్లు. నా పల్లెటూరి జ్ఞాపకాలన్నీ ఆ వూరితో ముడివేసుకున్నవే. అది జగిత్యాలకు నాలుగు కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది. ఇపుడు చిల్వాకోడూరు, ధర్మారం మీదుగా పెద్దపెల్లి, గోదావరిఖని వెళ్ళేరూటులో రెండో స్టేజియే ఆ వూరు.

బస్సు లక్ష్మిపురం పాత క్రాస్‌రోడ్ దాటుతుంటే గుర్తొచ్చింది. ఆ వూరివాళ్ళు మా పెరళ్ళు పోతాయి అని పెద్దపెల్లి వెళ్ళే రోడ్డు నిర్మాణానికి అడ్డం తిరగడంతో అది జాప్తాపురం మీదుగా పోయింది. అప్పట్నించి జాప్తాపురంకు సిరి వచ్చింది. ఇపుడు లక్ష్మిపురం ఒక మూలకైపోయింది. రోడ్డును రానీయకుండా చేసుకున్నందుకు ఇపుడు తమనుతామే తిట్టుకుంటారు ఆ వూరివాళ్ళు.

నా విషయంలోనూ అలాగే జరిగింది. జాప్తాపురం మేన సంబంధాల వాళ్ళు నన్ను మాకు వద్దుపొమ్మన్నారు. ఇంటిముందు జాగలేదు. ఇంటెనక జాగలేదు. ఓ పొలం లేదు, పెరడు లేదు. ఏ పూటది ఆ పూట కొనుక్కొని తింటారు. వ్యవసాయం ఉన్న ఇంటికిస్తే ఏడాది గాసం ఇంటినిండా ఉంటుంది. ఏదీ కొనుక్కోనవసరం ఉండదు అని నన్ను అల్లుణ్ణి చేసుకోవడానికి వరుసమేనమామలు నిరాకరించారు. నా కోసం పిల్లనిమ్మని అడిగి అమ్మ, అమ్మమ్మ అవమానంతో ఇంటికి తిరిగి వచ్చారు. గా సదువుకునే పోరనికి ఇస్తమా? ఏం పని చేసుకొని బతుకుతడు. ఎదురు కట్నం ఇచ్చినా మీకివ్వను పో అన్నాడట ఓ మామ. ఇరవై అయిదేళ్ళ తర్వాత ఇపుడు అయ్యో ఎందుకు ఇవ్వకపోతిమి అని తమనుతామే తిట్టుకుంటారు. ఆ వరుసైన మేనమరదళ్ళు మరీ బాధపడ్తుంటారు... ఈ చిన్నపాటి ఉద్యోగమూ, సౌఖ్యమూ చూసి.

ఆ మేనమరదళ్ళకున్న బాధ మా ఆవిడకు లేదు. అందుకు భిన్నంగా కూడా ప్రవర్తిస్తుంది.

"ఆ ! నన్ను చేసుకోక ముందు మీకు ఏం ఉండే. దిక్కుమాలిన ఇంటికి నన్నిచ్చారు. ఈ ఇంటికి నాతోనే సిరి వచ్చింది. నా అదృష్టం మంచిది. అంతేగానీ నీ మేనమరదండ్లను చేసికొని ఉంటే ఇపుడు వాళ్ళు బతుకుతున్నట్టే బతికేవాడివి. నాతో పెండ్లయినాకే నీకు ఉద్యోగం దొరికింది. నేను కమ్మగ వండిపెట్టినకొద్ది తినుకుంటూ నునుపుదేలినావు. పెండ్లి చూపులప్పుడు ఎట్లున్నావు. కట్టెలా ఎండిన ఎముకల్లాగా. అప్పటి నీ హాల్‌టికెట్ ఫోటో ఆల్బంలో ఉంది చూసుకో. అప్పుడెట్లున్నావో యాదికి వస్తుంది" అని మా ఆవిడ నన్ను దెప్పుతుంది.

పెళ్ళికాకముందు ఎవరికైనా ఏం ఉంటుంది. ఇంతింత చదువూ, రేపటి గురించిన గంపెడు ఆశలూ, ఆశయాలూ తప్ప. పెళ్ళి కాకముందు మా ఆవిడ మాత్రం ఎలా ఉండేది. తినీతినక ఎముకలపై చర్మం అంటిచ్చినట్టు, నెలరోజులు మంచం పట్టి ఉపవాసాలుండి అపుడే కోలుకున్నట్టు. అబ్బే ఆ మాట ఒప్పుకోదిప్పుడు. నేను అందంగా లేకపోతే మరి ఎట్లా నన్ను మెచ్చి చేసుకున్నావని ఎదురు ప్రశ్నిస్తుంది. నా సొంతిల్లూ, చదువులు, పిల్లలు, ఎదుగుదల అంతా తన గొప్పేనట.

నా మేనమరదండ్లు ఎంత అందంగా ఉంటారో అని ఎపుడో పోట్లాటలో అనేసి ఉంటాను. "అట్లాగా అందరు కలుస్తారు గదా! ఏపాటి అందంగా ఉంటారో చూస్తాను" అని మా ఆవిడ ఈసారి బెట్టు చేయకుండా బయల్దేరింది.

ఉద్యోగరీత్యా నేను ఊళ్ళు తిరగడం వల్లనైతేనేమి. మా పాత చుట్టాలు పల్లెటూరి జీవితాలకో, భీవండి వలసలకో పరిమితమైపోవడం వల్లనైతేనేమి, మా ఆవిడ సహకరించక పోవడం వల్లనైతేనేమి పాత చుట్టరికాల మధ్య పరస్పరం రాకపోకలు తగ్గిపోయాయి. ఇపుడీ పెళ్ళికి వెళ్ళడానికి సమయం కల్సి వచ్చింది.

పెండ్లి కొడుకు భీవండి బట్టల మిల్లులో పనిచేస్తాడు. అమ్మాయి నాకు అన్న కూతురు. ఏడో తరగతిలో ఆపేసి బీడి కార్మికురాలిగా స్థిరపడింది. మా అన్న కూడా బొంబాయి భీవండిల్లో యిరవై ఏళ్ళు బట్టల మిల్లుల్లో పనిచేసి తిరిగి వచ్చినవాడే. ఆ పరిచయాల్తోనే ఈ సంబంధం కుదిరింది. ప్రస్తుతం మా అన్న పాత పెరడు పొలం పని చూసుకుంటాడు.

మా అన్న వాళ్ళ నాన్న చనిపోయినపుడు పలకరించడానికి వెళ్ళలేకపోయాను. దాంతో యిక సంబంధాలు తెగిపోయినట్టే అనుకున్నాను. పెళ్ళికి రమ్మని పత్రిక యివ్వడం, రమ్మని మరీమరీ కోరడంతో చుట్టరికాల్ని రెన్యువల్ చేసుకునే ఈ అవకాశాన్ని వదులుకోకూడదనుకున్నాను. అదే మాట మా ఆవిడకు చెప్పాను.

మా ఆవిడకు చెప్పని కారణం యింకొకటుంది. మీకు చుట్టాలే లేరు. మా చుట్టాల బలగం చూడు ఎంత పెద్దదో అని మా ఆవిడకు కాస్త గీర. నిజానికి మాకు చుట్టాలకేం తక్కువ లేదు. కానీ యింట్లో ఆడవాళ్ళు సహకరించకపోతే పాత చుట్టరికాలు విచ్ఛిన్నం కావడానికి ఎంతో కాలం పట్టదు.

మా చుట్టాలు దూరం కావడానికి నువ్వే కారణం అని అమ్మ మా ఆవిడతో పోట్లాడేది. ఆ మాట నిజమేననిపించేది. కాని మా అమ్మ మా ఆవిడకు అమ్మ కాదుగదా ఔననిపించడానికి. అమ్మే అత్త. అమ్మ కాని వారు అత్త కాలేరు. కానీ అమ్మంటే ఆ వరుసతో కలిగే అనురాగం వేరు. అత్త అనగానే స్ఫురించే స్వభావం వేరు. మా అమ్మలో మా ఆవిడ అత్తనే

దర్శించుకుంది. మా అమ్మ సైతం కోడల్లో కూతుర్ని చూసుకోలేదు. కోడలుగానే చూసుకుంది. ఎక్కడ ఎప్పుడు ప్రారంభమైందో గానీ అత్తాకోడళ్ళ వివాదం చివరకు ఒకరు ఔనంటే మరొకరు కాదనాలనేదే వారి తత్వంగా మారి కూర్చుంది.

అత్తకు మాటకు మాట జవాబిస్తూ "నేనేమైనా మీ పాత చుట్టాలతో కొట్లాట పెట్టుకున్నానా! ఎందుకు నన్నాడిపోసుకుంటావు" అనేది మా ఆవిడ. చుట్టాల్ని దూరం చేసుకోవడానికి కొట్లాటే పెట్టుకోవాల్నా! వాళ్ళు పిలిసిన పండుగ పబ్బాలకు వరుసగా రెండుసార్లు పోకపోతే రాకపోకలు అవే తగ్గిపోతాయి. ఏడికి రమ్మన్నా కాలు నొస్తుంది, వేలు నొస్తుంది అనుకుంటూ యింట్లనే పంటివిగానీ రాకపోతివి. అన్నీ హాయిగానే ఉంటే నాకక్కడ తెల్సినోల్లెవరూ లేరంటివి. నాలుగు సార్లు పోతే తెలుస్తరు. నీకు మాత్రం నా కొడుకు నీ పెండ్లి కాక ముందు తెలుసా ! మరి ఎట్లా కల్సిపోయినవు. అట్లనే ఏ వరుసైనా కల్సిపోవచ్చు" అని అమ్మ వాదన.

"అంతా కొత్తోళ్ళు నేను రాను. తల్లీ కొడుకులు మీరే పోయి రాండ్రి" అనేది మా ఆవిడ. ఎవరం వెళ్ళినా భార్యాపిల్లలం కల్సి వెళ్ళినట్టుండదు గదా అంటే విన్పించుకోదు. అట్లా దూరం అయ్యాక ఇప్పుడు నాకు చుట్టాలు లేరని మా ఆవిడ నన్ను దెప్పడం నన్ను కత్తితో కోసినట్టుగా ఉంటుంది.

"మేం చిన్నపిల్లలుగా ఉన్నపుడు పెద్ద నాన్న, పెద్దమ్మ అంటూ వెళ్ళినపుడల్లా ఎక్కువ రోజులు ఈ పెళ్ళికి వెళ్తున్న వాళ్ళ ఇంట్లోనే ఉండేవాళ్ళం" అని మా ఆవిడకేసి చూస్తూ అన్నాను.

బాల్యం గుర్తొచ్చి కళ్ళు మూసుకొని ఆ దృశ్యాలు చూస్తూ ఉండిపోయాను. చూస్తుండగానే ఆ పెద్దనాన్న పెద్దవాడైపోయాడు. మన కళ్ళముందు కళకళలాడిన యిళ్ళు, సున్నం వేసేవారు లేక, ఉండేవారు లేక పాడుబడి గోడలమీద పాకురు పెరిగి, ఎండి, పెచ్చులూడి శిధిలమవుతున్నట్టుగా ఆ వూరి సంబంధాలన్నీ యిపుడిలా బీడుపడి పోయాయి. నేను ఒక్కడిని వెళ్ళినపుడు పాతచుట్టాల తాలూకు కొత్తకోడళ్ళు, కొత్త అల్లుండ్లు పరిచయాల్లేక ముడుచుపోయేవారు.

అట్లా పాత చుట్టాల్లో సగంమంది కోడళ్ళుగా, అల్లుళ్ళుగా, వారి పిల్లలుగా నాకు కొత్తవారై పరిచయం తగ్గిపోతూ వచ్చింది. నాకే యిప్పుడా పాత వరుసలు, సరిగ్గా గుర్తులేవు. ఎవరు ఎవరింటి కోడలో తెలియదు. మా ఆవిడకు ఆ కాస్తా ఆసక్తి లేదు.

మా పిల్లలకు ఈ బీరకాయపీచు బంధుత్వాల గురించి ఎన్నిసార్లు చెప్పినా తలకెక్కలేదు. ఆచరణలో లేని వరుసలు, వాళ్ళ అవసరాల్లో భాగంకాని చుట్టరికాల్ని పిల్లలు మరిచిపోయారు. ఇలా మా తరంతోనే ఈ పల్లెటూరి చుట్టరికాల వరుసలు అదృశ్యమైపోతున్నాయి అని నిట్టూర్చాను.

ఇప్పుడు కొందరు నన్ను బావ, మామయ్యా, బాబాయి అనే బదులు గంపగుత్తగా "సారు" అనే వరుసతో పిలుస్తున్నారు. ఎందుకిలా జరుగుతోంది.

కూతురు పెళ్ళి చేస్తున్న ఈ అన్న నాకన్న వారం రోజులు ముందు పుట్టడంవల్ల అన్నయిపోయాడు. చిన్నప్పట్నించి అరేయి, ఒరేయి పిలుపులే. నేను పెద్దయ్యాక మానేసినా వాడు నన్ను అరేయి అని పిలుస్తూ తాను అన్నగా ఆధిక్యతను స్థిరపర్చుకున్నాడు. వాడు చిన్నప్పట్నించీ 'అరేయి నేన్నీకు అన్నను తెల్సా, నువ్వు నా మాట వినాలె. నీకు ఎక్కువ తెలువదు' అని నాపై పెద్దరికం చేసేవాడు.

నిజంగానే నాకు వ్యవసాయం గురించి, పల్లెలు, పంటలు, పశువుల గురించి ఎక్కువ తెలియదు. అవన్నీ తెలియజెప్పింది వాడే. చిన్నపుడు, పెరండ్లు, వాగులు, తోటలు, తాటివనం కలియదిప్పింది వాడే. కాని వాడికి చదువు సరిగ్గా అబ్బలేదు. లేదా చెప్పాల్సినవాళ్ళు వాడికి సరిగ్గా చదువు చెప్పలేదు. దాంతో చదువు చిన్నపుడే వదిలేసి కొంతకాలం వ్యవసాయం పనులు చేసాడు. పదిహేనో ఏటే పెళ్ళి. పాత వరుస మేన మరదల్ని యివ్వాలని వాళ్ళు ఎంతో ప్రయత్నం చేసారు. మా అన్న అసలే వద్దన్నాడు. ఆ అమ్మాయి అలిగి వాడితో చాన్రోజులు మాట్లడలేదు. వాడు వద్దన్న అమ్మాయిని అమ్మ నా కోసం అడిగితే వాళ్ళ నాన్న మాటలు పట్టుకొని నన్ను వద్దంటూ మూతి మూడు వంకర్లు తిప్పిందట మరదలు.

పెళ్ళయ్యాక ఆ అన్నకు యిరవై ఏళ్ళకే యిద్దరు పిల్లలయ్యారు. ఇపుడు చేస్తున్నది రెండో కూతురు పెళ్ళి. ఇరవై ఏళ్ళకే బరువు బాధ్యతలు పెరిగి వాడు తల్లికీ, భార్యకూ అంటే మా పెద్దమ్మకూ, వదినకూ వ్యవసాయ బాధ్యతలు అప్పగించి, భీవండి బట్టల మిల్లుల్లో పని వెతుక్కుంటూ వెళ్ళాడు. దాంతో నేను విద్యార్థిగా ఉండగానే వాడు పిల్లల తండ్రయ్యాడు, సంపాదనా పరుడయ్యాడు.

పెళ్లయి ఒక కూతురు పుట్టగానే మా అన్న ప్రవర్తనలో చాలా మార్పు వచ్చింది. సంసారం అంటే నీకేం తెల్సురా అంటూ నన్ను మరీ చిన్నపిల్లాడిలా చూసేవాడు. భీవండి బతుకుల గురించి, జీవనతత్వం గురించి ఊరిస్తూ చెప్పి నీకేం తెల్సురా అని చిన్నబుచ్చేవాడు. అంత తెల్సిందనుకున్న మా అన్న పెద్ద కూతుర్ని అయిదో తరగతికే చదువు మాన్పించాడు. రెండో కూతుర్ని ఏడో తరగతికే చదివినకాడికి చాలన్నాడు. చివరకు భీవండి వెళ్ళే పదవ తరగతి చదివిన సంబంధాన్ని మించి చూడ లేకపోయాడు.

నాకు ఉద్యోగం వచ్చి భార్యాపిల్లలతో కాస్త కుదురుకునేసరికి మా అన్న ఎదుగుదల ఆగిపోయింది. ఆశ్చర్యమనిపించింది. ముందు పొడిచిన పొద్దు ముందే గుంకుతుందా! అతనికి పిల్లల పెళ్ళి బాధ్యతలు మీద పడ్డం మొదలైంది. గానుగెద్దు జీవితం అయిపోయింది.

పూర్వం పెద్దనాన్నలు, అయిదారుగురు నువ్వులనూనె గానుగులు కట్టేవారు. అప్పుడే కొత్తగా ఆయిల్ మిల్లులు వచ్చాయి. నువ్వుల నూనె బదులు, పల్లి(వేరుశనగ) నూనె వాడకంలోకి వచ్చింది. కొత్తలో ఈ పల్లినూనె వాడితే శరీరమంతా దద్దుర్లు లేచేవి. పైత్యం చేసి తల తిప్పడం, పసరు వాంతులు జరిగేది. నువ్వులనూనె వాసన కమ్మగా, రుచి అద్భుతంగా ఉండేది. ఇపుడు అది చేదుగా పల్లినూనె కమ్మగా అన్పిస్తోంది. రుచులూ, అభిరుచులూ ఎపుడూ ఒక్కతీరుగా ఉండవు. కాలం ఎన్నో మార్పులు తెస్తుంది.

మిల్లు నూనె ప్రవేశంతో గానుగ... నువ్వులనూనె వ్యాపారంతో రాజులా బతికిన కుటుంబాలు కొత్త వృత్తులు వెతుక్కోవాల్సి వచ్చింది. వారికి బట్టలు నేయడం అనేది ఎపుడో మానేసిన కుల వృత్తి. ఏ వ్యాపారమూ, వ్యవహారమూ తోచక, చెప్పేవారు లేక పదిమందిదాకా బొంబాయి బట్టల మిల్లుల్లో

కార్మికులుగా చేరారు. ఆ కాలంలో టీచర్లకన్నా, ఎన్జీవోలకన్నా బట్టల మిల్లు కార్మికులకే గిట్టుబాటు ఎక్కువ.

కాని కాలం ఒక్క తీరుగా ఉండదు. బొంబాయి బట్టల మిల్లుల్లో రాజీనామా చేస్తే ప్రావిడెంటు ఫండు చేతికొస్తుందని, దాంతో పొలం కొనుక్కోవచ్చని పెద్దనాన్నలు రాజీనామా చేశారు. కాస్త పొలాలు కొన్నారు. ఇంటివద్ద ఏ గొడ్డూ గడ్డీ గాదం లేని మా మామ ఒకాయన రాజీనామా చేస్తే వచ్చిన ప్రావిడెంటు ఫండూ, మిగుల్చుకున్న పైసలు కలిపి భీవండిలోనే రెండు పవర్‌లూంలు పెట్టాడు. ఇపుడు యాభయి పవర్‌లూంల యజమాని అయ్యాడు. పెదనాన్నలకి దూరదృష్టి లేదు. ఎంతకూ వ్యవసాయం మీద ఆశ. ఉన్న ఊరు మీద మమకారం. ముఖ్యంగా మిల్లు కార్మికులుగా కోల్పోయిన స్వేచ్ఛ వ్యవసాయప్పనుల్లో అంతా తమ యిష్టం. పెదనాన్నలు యిలా ఆలోచించి ఇల్లు చేరినా ఆ తర్వాత ఇంట్లో వెళ్ళక నగదు చూసిన కన్ను భీవండి వెళ్లక తప్పలేదు. భీవండిలో ఏ కార్మిక చట్టాలూ, రక్షణలూ ఉండవు కూలీ తప్ప.

మా అన్న విషయానికి వచ్చేసరికి ఆశ్చర్యంగా పెదనాన్నలకు భిన్నంగా భీవండినే యిష్టపడ్డాడు. అంత తెలివి ఏమైపోయిందో తెలియదు. గానుగెద్దులా అందులోనే యిరుక్కుపోయాడు. ఒకరకమైన జీవితానికి అలవాటుపడ్డాక ఆ గాడి నుండి బయటపడ్డం కష్టమేమో! యవ్వనమంతా యిరువై ఏళ్ళు ఏకాంతంగా భీవండిలో గడిపి, వదిన ఇక్కడ పల్లెలో వ్యవసాయం చేసి వృద్ధాప్యం వచ్చేసరికి సంసారం పట్టుకొని ఉండడంలోని సుఖమేమిటో ఆ అన్నకే తెలియాలి. ఇపుడు పరమ భక్తుడైపోయాడు. ఇంతింతబొట్లు, నామాలూ, జంధ్యాలూ, పూజలూ, ఏమైతేనేం గత కొన్నేళ్ళుగ నేను ఊళ్ళోనే ఉండడంవల్ల మా అన్న ఈ పెళ్ళి పత్రిక ఇవ్వగలిగాడు. చిన్ననాటి అభిమానంతో తప్పక రమ్మని కోరాడు!

చిన్నప్పుడు బావామరదళ్ళుగా పరాచికాలాడుకున్న మరదళ్ళు యిపుడెలా ఉన్నారో. సరస్వతి నాకన్నా ముందే కోతిలా పాకి చెట్లెక్కేది. రేన (రేగు) పండ్లు, మామిడికాయలు, చింతకాయ, ఒకటేమిటి ఎన్నో.... రివ్వున బాణంలా పరిగెత్తేది. ఆమె, ఆమెతో పాటు మరో ముగ్గురు మరదళ్ళు, మా అన్నలు, మేం కల్సి వాగుల్లో, పెరళ్ళల్లో, మంచెమీద, మంచెకింద ఆడిన ఆటలు - తిరిగిన కాళ్ళు ఏడడుగులేనా కల్సి నడిచింది. ఎన్ని వేల అడుగులో కల్సి

నడిచాం. నా ఎంగిలి, నీ ఎంగిలి, కాకి ఎంగిలి అంటూ ఎంగిలివి కొరుక్కు తిన్నాము. పెండ చేతులు, కొండి జడలు, జిడ్డు కారే ముఖాలు, ఒళ్ళె (చిన్న పిల్లల చీరె) మోకాలి పైకి కట్టి కొంగునే ఎన్నో సంచుల్లా నింపే ఘటాలు. పరుల పెరళ్ళల్లో దొంగతనాలు. సరస్వతిని అమ్మమ్మ నా కోసం అడుగుతానన్నపుడు ఎంత సంతోషపడ్డానో అంత అవమానించారు.

బస్సు దిగి నడుచుకుంటూ చేరేసరికి ఎండ బాగా దంచుతోంది. ఎండకు, చెమటకు, తన మేకప్పు చెదిరిపోతున్నందుకు మా ఆవిడ లోలోపల ఏదో గొణుక్కుంటోంది. పెళ్ళి సన్నాయిలో, మైకు హోరులో ఏదీ విన్పించడం లేదు.

బస్సు దూరేంత వెడల్పయినా లేని వాకిట్లోనే పెళ్ళి. తాటాకుల కొత్త పందిరి, పాతయిల్లు మేరకే ఉంది. పెళ్ళిపందిరి చుట్టాలతో కళకళలాడుతోంది. జనం ఎక్కువై తొక్కిసలాటగా ఉంది. నాలుగు రెట్ల మంది పందిరి వెలుపలే నిలబడిపోవాల్సి వచ్చింది. మా ఆవిడ ఆడవాళ్ళున్న వైపు వెళ్ళింది. నేను అందర్తోపాటు ఎండలో నిలబడ్డాను. నేను గుర్తుపట్టగలిగినవారిని పలకరిస్తున్నాను. నన్ను గుర్తుపట్ట గలిగిన వాళ్ళు పలకరిస్తున్నారు. బావా అని కొడుకా అని పలకరిస్తూ చిన్ననాటి విషయాలు గుర్తు చేస్తున్నారు. పిల్లలు వాళ్ళ సందడిలో వాళ్ళున్నారు.

"భోజనాలకాడ అంత పెద్ద టెంట్లు వేయించినోడు పెళ్ళిపందిరి కాడ రెండు టెంట్లు ఏపిస్తే ఏమైతుంది. ఇంత ఖర్చు చేస్తూనే ఇంత పిసినారితనం ఎందుకో. వచ్చిచూడొద్దా బావా నువ్వు" అంటూ పలకరించాడు లక్ష్మిరాజం.

"ఇంటి అల్లునివి నువ్వు లేవా బావా చెప్పడానికి" అని నవ్వాను నేను.

"మామ పోయినంక అంతపోయె ఈ బావమరిది నా మాట దేకుతాడోయ్ బావ. మీ అన్న గుణం మీకు తెలువదా. ఎవరి మాట వినడని" అన్నాడు లక్ష్మిరాజం మళ్ళీ.

"మా చెల్లెతోని చెప్పించనుంటివి" అన్నాను.

"ఆ అది చెప్తే ఇంటడా. ముగ్గురు పిల్లల తల్లిని పట్టుకొని నీకేం తెలువదే

సెల్లె ఊకో. అన్ని సూసుకునుటానికి నేనున్న గదనే అన్నాడు" అంటూ లక్ష్మీరాజం బావ కారుతున్న చెమటల్ని తుడుచుకొని తువ్వాలు నెత్తిమీద కప్పుకున్నాడు.

ఈ ఎండకు, ఆకలికి తాళలేక తలువాలు(తలంబ్రాలు) ఎపుడు పడుతాయా, భోజనాల టెంటులోకి ఎపుడు దూరుతామా అని చూస్తున్నారంతా. వాలంటీర్లు. 'క్లాత్‌వాల్' దడి కట్టకపోతే ఈ పాటికి సగంమంది అందులో దూరేవారే. ఇంటిపక్క పెరట్లోనే ఆ టెంటుంది. పెళ్ళి పందిట్లో ఏం జరుగుతోందో ఏమీ కన్పించడంలేదు.

"కొన్ని కుర్చీలైనా వేసి ఉండాల్సింది. అందరు నిలబడితే ఏం కనిపించడం లేదు" అన్నాను లక్ష్మీరాజం బావతో ఊసుపోక.

"టెంటే గతి లేదంటే కుర్చీలు తెప్పిస్తాడు?" అంటూ నవ్వాడు లక్ష్మీరాజం బావ. ఎవరో అక్షింతల తాంబూలం పట్టుకుని తిరుగుతూ నమస్కారం సార్ అనేసరికి పిడికెడు తీసుకున్నాను. అతనెవరు అని లక్ష్మీరాజం బావనడిగాను. "మీ అన్న బావమరిది" అన్నాడు. అతన్ని పోల్చుకోలేకపోయాను.

ఏళ్ళు గడుస్తూ వయస్సు పెరుగుతుంటే చాలామందిని గుర్తుపట్టలేక పోయాను. పాత చుట్టాలనిపించిన వారికల్లా నన్ను నేను, అమ్మ – కొడుకుగా – అమ్మమ్మ మనవడిగా పరిచయం చేసుకుంటూ నమస్కరిస్తున్నాను. వారిలో చాలామంది నాలాగే సందిగ్ధ స్థితిలోనే ఉన్నారు. కొడుకు పాతచుట్టమైతే కోడలు నాకు కొత్త. చెల్లెలు పాత చుట్టమైతే బావ నాకు కొత్త. ఇట్లా పాత చుట్టాల్లో సగం మందితో పరిచయం లేకుండా పోయింది.

"...అదిగో జీలకర్ర బెల్లం పెట్టిన్రు" అంటూ ఒకరిద్దరు ముందుకు తోసుకుంటూ కదిలారు. జీలకర్ర బెల్లం పెట్టడంతో పెళ్ళిలోని ముఖ్య ఘట్టం అయిపోయినట్టే. ఆ తరువాత మరో పావుగంట గడిచాక తలువాలు వేయండి అంటూ మైకులో పిలుపు వినపడింది. తలువాలు వేస్తూ అటునుండే భోజనాల టెంటులోకి దారి తీశారు.

ఈ వీడియోలు వచ్చాక పెద్ద చిక్కొచ్చి పడింది. పూర్వం కట్నం రాయిస్తే చాలు. లేదా ఏదో ఒకవేళకు పెండ్లివాళ్ళను కలిస్తే చాలు, పెళ్ళికి వచ్చినట్టు హాజరు పడేది. వీడియోలొచ్చాక ఎప్పుడు వచ్చాడు, ఎక్కడ నిలబడ్డాడు

వంటివన్నీ రికార్డు చేసి పట్టిస్తున్నాయి. అందుకని ఒక లైనులో వెళ్ళి అక్షింతలు వేసి వీడియోలో పడ్డాననిపించుకొని ముందుకు నడిచాను. పెళ్ళికి వచ్చినందుకు అందరికీ థాంక్సు చెప్తున్న అన్నకు నమస్కరించాను. అన్న బిగ్గరగా కౌగిలించుకొన్నాడు. ఏనాటి పాతకాలం రక్త సంబంధమో. అప్యాయతతో అణువణువూ పులకరించింది. వదినకు నమస్కరించాను. మీ చెల్లెలు అంటూ మా ఆవిడను పిలిచి పరిచయం చేశాను. వెనకట చుట్టాల మధ్య నమస్కారాలుండేవి కాదు. నవ్వుతూ ఎపుడొచ్చినావు అనే పలకరింపులే ఉండేవి. ఇపుడు నమస్కరించి పలకరిస్తే తప్ప మనిషిని పలకరించుకున్నట్టు కాదు. వదిన మా ఆవిడ చేతిని ఆప్యాయంగా దగ్గరకు తీసుకుంది. నేను భోజనాల టెంటువైపు నడిచాను.

భోజనాల టెంటులో బాగా రద్దీగా ఉంది. అక్కడ కూడా పలకరింపులు, పరిచయాలు చేసుకుంటూ భోంచేసేసరికి మధ్యాహ్నం రెండైపోయింది. కట్నకానుకలు ఓ నోటు బుక్కులో రాయిస్తూ పాత చుట్టాలు కొత్త చుట్టాలు చాలామంది వెళ్ళిపోయారు. పెండ్లి పిల్లవాడి తరపువాళ్ళు ఏదో గొడవ పడుతున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు అదిగో అరుంధతీ నక్షత్రం అని అయ్యగారు చూపిస్తుంటే ఫక్కున నవ్వొచ్చింది. పందిరి గుంజ పక్కన పాతిన అందుగుకొమ్మ కూడా నవ్వుతూ ఊగింది.

"పత్తి గింజలు అలుకడం" అంత ఎండలోనే పూర్తి చేయించాడు అయ్యగారు. ఇంట్లో బట్టలనేత ఆగిపోయి మూడు తరాలైనా పెళ్ళిపందిరి పోలులో పాతకాలంనాటి నేస్తున్నకోద్దీ బట్ట చుట్టుకునే దోనుగు పసుపు కుంకుమలతో మెరుస్తోంది. మైలపోలు తీసేదాకా ఆ దోనుగో పెళ్ళిపీట.

పల్లెల్లో కూడా పెళ్ళి వంటలు పట్నాల్లోల్లాగే చేయిస్తున్నారు. కాని మా అన్నకు కారంమీది మమకారం యింకా పోనట్టుంది. కూర ఆగివస్తుందని మటన్, బగారాలో కారం కాస్త దట్టంగానే వేశారు. మాటల్లో పడి కాస్త కచ్చు ఎక్కువే పడిందనుకుంటాను. కారానికి, డాల్డాకు, ఆ ఎండకు ఒకటే నోరు మంట, దాహం. ఎన్ని నీళ్ళు దాగినా కడుపు ఉబ్బడమే గానీ దాహం, మంట చల్లారదు. భుక్తాయాసంతో కాస్త నిద్ర వస్తోంది. ఆ సరికి పెండ్లి కూతురూ, అల్లుడూ కూడా భోజనం పూర్తిచేసినట్టున్నారు.

"అప్పగింతలదాకా ఉండురా....." అంటూ పెద్దమ్మ ఆప్యాయంగా పెయ్యంతా నిమిరింది. "రాత్రి తిన్నంక పోదువు. బస్సులు, ఆటోలు ఎంత రాత్రయినా దొరుకుతయిరా" అంది. మళ్ళీ చెవిలో గుసగుసగా" అయిదు మేక తలకాయలు, కాళ్ళున్నాయి. ఈతకల్లు రెండు కుండలు తెమ్మని చెప్పిండు! తప్పక ఉండురా" అంది పెద్దమ్మ.

నాక్కూడా ఉండాలనే ఉంది. కాస్త పొద్దు వంగిన తర్వాత పాత చుట్టాల యిండ్లలో అందరినీ పలకరించవచ్చుననుకున్నాను. సాయంత్రానికి యింత రద్దీ ఉండదు.

"కొంచెంసేపు అట్ల ఒరుగుపోరి. సురేష్‌గాని యింటికి తీసుకుపోరా" అంటూ పెద్దమ్మ, మనవడిని పురమాయించింది.

"దాయే పెదనాన్నా. పెద్దమ్మా! పెద్దన్నయ్య ఏం చదువుతున్నడే" అంటూ పెద్దమ్మ చిన్న మనవడు మాట కలిపాడు. మా ఆవిడ చెప్పింది. అట్లనా అని ఆనందంతో కండ్లు మెరిసాయి.

"అయితే అన్నయ్య యింజనీరింగ్ చదువుతున్నాడన్నమాట. గిదే ఇల్లు" అని ఆ ఇంటిలోకి నడిచాడు.

వెళ్ళగానే ముంతతో కాళ్ళకు నీళ్ళిచ్చింది యింటావిడ. నేనూ మా ఆవిడా కాళ్ళు కడుక్కొని, చల్లని నీళ్ళు తాగి అలా మంచంలో కూర్చున్నాం. మా పిల్లలు అదీఇదీ చూస్తూ ఏదో అడుగుతున్నారు.

ఇంటావిడను నేను గుర్తు పట్టలేకపోయాను. నా పద్ధతి నాకుంది గదా. నన్ను నేను పరిచయం చేసుకొన్నాను. మా ఆవిడను పరిచయం చేశాను. ఆమె కూడా పెళ్ళి భోజనం చేసి వచ్చినట్టే ఉంది. కారం మంటతో నోరు ఊదుతోంది. బీడీల ఆకు కత్తిరిస్తూ ఆమె ఓసారి నన్నూ మా ఆవిడనూ ఎగాదిగా చూసింది. విరబూసిన పూవులా నవ్వుతూ అంది.

"నన్ను గుర్తు పట్టలేదా బావా!"

నేను నిజంగానే గుర్తుపట్టలేదు. కాని బావా అన్న పిలుపుతో ఒళ్ళు పులకరించింది. మా ఆవిడ నాకేసి విచిత్రంగా చూసింది. ఆ చూపులో ఎన్ని

భావాలో ... అసూయ, అనుమానం, ఈమెవరు, చిన్నప్పటి లవ్ ఎఫేరా?

"నేను సరవ్వను. సరస్వతిని. నన్ను నీకు ఇమ్మని అత్త అడగవస్తే ఇయ్యపో అని మా నాయిన ఎల్లగొట్టిండు. సూడు, గా సరవ్వను."

కొద్దికొద్దిగా పోలికలు గుర్తు తెచ్చుకుంటూ పరిశీలనగా చూశాను. చిన్నప్పుడు చూసిన సరస్వతేనా ఈమె. ఇపుడు ఆమెలో చిన్ననాటి పెంకితనం లేదు. వయస్సును మించిన అనుభవంతో ఆమె శరీరం, వ్యక్తిత్వం నిండుకుండలా హుందాగా ఉంది. మాట తీరులో చాలా మార్పు వచ్చింది.

"అబ్బ ఎన్నాళ్ళకు కలిశాం! అకస్మాత్తుగా" అన్నాను ఆశ్చర్యంగా.

"నేను నిన్ను పెండ్లికాడనే గుర్తుపట్టిన. రాములు బావనే కదా అని పెద్దత్తనడిగిన."

"ఇరవై ఏండ్లయిపోయింది గదా. యిన్నేండ్లు మన చుట్టాలల్లో ఏ ఫంక్షన్‌లో కనపడలేదేమిటి?" అని అడిగాను.

"కొంతకాలం భీవండీ, సూరత్‌లలో మీ తమ్మునితోని అక్కన్నే ఉన్న బావా!... అంతా మూడేండ్లయింది మళ్ళీ ఇక్కడికి వచ్చి. పిల్లలను నీతీరు బాగా చదివించాలని మన దేశం వచ్చిన బావా!" అంటూ కొంటెగా నవ్వింది. ఆమె నవ్వులో కొంటెతనంతోపాటు ఎన్నో ప్రాంతాలు తిరిగిన జీవితానుభవం ఉంది.

"నువ్వు చేసుకుంటానన్న మేనమరదలు ఈమెనేనా" అంటూ ఇంత అందంగా హుందాగా ఉందా అన్నట్టుగా ఆమెకేసి మా ఆవిడ ఎగాదిగా చూసింది. అమె తనకన్నా అందంగా, గంభీరంగా ఉండడం మా ఆవిడకు నచ్చినట్టుగా లేదు. తనకన్నా కాస్త నలుపుగా, దీనంగా ఉంటే సంతోషించేదేమో!

"అవునక్కా నన్నే చేసుకుంటానన్నాడు బావ" అంటూ సరస్వతి మా ఆవిడతో వరుస కలిపింది.

పిల్లల చదువులూ, బతుకు తీరుతెన్నులూ, గత స్మృతులూ ఎన్నో నెమరేసుకున్నాం. మా ఆవిడా, పిల్లలూ ఆసక్తిగా వింటున్నారు. సరస్వతి తన

పిల్లలకు నన్ను పరిచయం చేసింది. కూతురు అపుడే పెళ్ళికెదిగింది. అదే మాట అడిగాను.

"ఇపుడు పెండ్లయిన పిల్లగాని కోసం మా అడిగిన్రు. కాని భీవండిపోయే సంబంధం నాకు యిష్టంలేదు. భీవండి పోయి మేం ఏపాటి బాగుపడ్డం? నీ కొడుకు తీరు ఈమెను యింజనీరింగో, టీచరు కోర్సో చదివిస్తాను" అంది సరస్వతి. "మీ పెద్దన్నయ్య ఇంజనీరింగ్ చదువుతున్నడే. నువ్వూ సీటు సంపాదించాలె" అంది మళ్ళీ తనే.

నిమ్మరసంతో షరబతు చేసి అందరికీ యిచ్చింది సరస్వతి.

"మా నాయిన ముందుచూపు లేక నా బతుకు యిట్లా చేశాడు. నీతో పెళ్ళయి ఉంటే ఈ అక్క తీరు నేను సుఖంగా ఉండేదాన్ని కదా. చిన్నప్పుడే పెండ్లిల్లు చేయడంతో నా బతుకు గిట్లయి పాయె. కాస్త జ్ఞానం ఎదిగింతర్వాత ఆడపిల్లకు యిరవై ఏండ్లయినా పడినంక పెండ్లి చేస్తే నేను తప్పకుండా నిన్నే చేసుకునే దాన్ని. పదిహేనేండ్లకే నన్ను మందికి అంటగట్టి చేతులు దులుపుకునే" విషాదంగా అంది సరస్వతి.

"ఇపుడు నీ బతుక్కేమైందక్కా" అంటూ మా ఆవిడా ఓదార్చింది.

"అక్కా కష్టమైనా సుఖమైనా కలిసి ఉన్నపుడే ఎంతో ఆనందం. ఎక్కడికో పోయి, ఏడాదికో పదిహేను రోజులుండిపోతే జీవితమంతా యిదే అయితే అదేం జీవితమక్కా? ఇలాంటి జీవితం పగవాళ్ళకు కూడా వద్దు. ఎన్నో కోరికలుంటాయి, ఎన్నో కష్టాలుంటాయి. చెప్పుకోవడానికంటూ మనిషి లేకపోయె. ఊర్లో ఒంటిగా ఉన్న ఆడదంటే అందరికళ్ళూ ఒకతీరే ఉంటాయా! అత్తగారింటివద్ద ఉండలేక ఇక్కడే తల్లిగారి ఊర్లో కిరాయికు తీసుకొని ఉంటున్నాను" అంటూ నాకేసి తిరిగి అడిగింది సరస్వతి.

సరస్వతి వ్యక్తిత్వం వన్నెకొచ్చినా మౌలిక స్వభావం మునుపటిదే. అదే చొరవ.

ఇంటిముందున్న వేపచెట్టు ఆకులు కొద్దిగా కదిలాయి. వాతావరణంలో వేడి ఇంకా తగ్గలేదు. పెంకుటిల్లు కావడంతో కాస్త వేడి తక్కువగా వుంది.

సారవ్వ బీడీలకోసం ఆకు కత్తిరిస్తూ ఉంది. చీరపై పడిన ఆకుతుక్కును దులుపుకుని లేచింది. కాళ్లుచేతులు కడుగుకొని చీర మార్చుకోవడానికి గదిలోకి వెళ్లివచ్చింది. మాఆవిడను కాళ్లుచేతులు కడుక్కోమంది. మా ఆవిడ అటువైపు వెళ్లగానే మళ్లీ ప్రశ్నించింది సారవ్వ.

"నాయన పనికిరాడనుకున్న నువ్వు బాగుపడ్డానికి, బతుకు గెల్చుకున్నామనుకున్న మేము వెనకబడిపోవడానికి కారణం ఏంటిది బావా"

సరస్వతికి పెరిగిన లోకజ్ఞానం చూసి ఆశ్చర్యం వేసింది. పల్లెటూల్లో బీడీలు చేసుకుంటూ బతుకుతున్న సారవ్వ ఇంత పెద్ద ప్రశ్న వేయడం, జీవితం ఎంత నేర్పుతుందో అనుకున్నాను. కాసేపు వివరించి చివరకు...

"సరవ్వా! సమాజం సామాజిక అభివృద్ధి తీరు తెన్నులు... దీన్ని పసిగట్టి కొత్త అభివృద్ధిని అందుకున్నవాళ్ళు ఎదిగారు. మిగతావాళ్ళు వెనకబడిపోయారు" అన్నాను నేను.

అదంతా విని తన అనుభవాన్ని కలిసిపంచుకుంది సరస్వతి. తెలిసీతెలియని అనుభవంతో సంపాయించిన సొమ్మును పొలం కొనడానికి, ఇల్లు సరి చేసుకోడానికి ఖర్చు పెట్టారు. వ్యాపారంలోకి, పరిశ్రమల్లోకి, తమ సంపాదనను పెట్టుబడిగా మార్చుకోలేకపోయారు. బతుకంతా గడిచిపోయాక అనుభవం వచ్చి ఏం లాభం...

"బావా! సంపాయించిన పైసలతో అక్కడనే ఓ నాలుగు సాంచాలు కొనడానికి పెట్టుబడి పెట్టకుండా, ఉన్న వూరు అని వ్యవసాయానికి పెట్టితే బతుకు ఇట్లా ఎటుగాకుండా ఆగిపోయింది" అంటూ నిట్టూర్చింది సరస్వతి.

నా బతుకేదో గొప్పగా ఉన్నట్టు సరస్వతి భావించడం... తనకన్నా బాగా బతుకుతున్నవాళ్లు ఎందరో... పేదరికంవల్ల... నీతినిజాయితీలు అనుకుంటూ ప్రమోషన్లకోసం లంచాలను పెట్టుబడులు పెట్టకపోవడంవల్ల ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉండిపోయింది. ఉద్యోగంలో ఎదుగుదల లేదు. జీవితంలో పెద్దగా మార్పు లేదు. అదేమాట మా ఆవిడ ఇతరులతో పోల్చుతూ ఎప్పుడూ సాధిస్తూనే ఉంటుంది. వాళ్లు అంత సంపాయించారు... వీళ్ళు ఇంత

సంపాయించారు... మీరు ఏం సంపాయించారు... అని విమర్శిస్తూనే ఉంటుంది. అదే విషయం సరస్వతికి వివరించాను. అప్పుడే మా ఆవిడ రిఫ్రెష్ అయి రావడంతో మా ఆవిడ గురించి చెప్పడం టక్కుమని ఆపేసి మాట మార్చాను.

"సరస్వతీ! నిజానికి నేను కూడా అభివృద్ధిలో ఆగిపోయిన వాణ్ణే. నాన్న చిన్నపుడే పోవడాన చదివించేవాళ్ళు లేక పైచదువులు చదవలేక ఎస్జీవోనయ్యాను. క్లాసులో ఎంతో వెనకపడ్డవాళ్ళు కంటిన్యూగా చదువుకుంటూ పోయేసరికి ఇపుడు వాళ్ళు హైకోర్టు జడ్జీలుగా, యూనివర్సిటీ ప్రొఫెసర్లుగా, మంత్రులుగా, అమెరికాలో డాక్టర్లుగా ఎదిగారు. మా అమ్మ చేతికష్టంతో అంత పెట్టుబడి పెట్టడం సాధ్యంకాక ఆగిపోయాను."

"అది సరే బావా! ఆధునిక అభివృద్ధి అందుకోవాలన్నావు. వ్యవసాయంలో ఎన్నో ఆధునిక పద్ధతులు వచ్చాయి. అనుసరిస్తూనే ఉన్నాము. బట్టల మిల్లులు కూడా ఆధునిక అభివృద్దే గదా! అయినా మేం ఎందుకు వెనకబడ్డట్టు?"

"ఏదైనా సరే కార్మికరంగం గానీ, ఉద్యోగరంగం గానీ సంఘటితరంగంగా యాజమాన్యంతో బేరం చేయగలిగిన శక్తి, యాజమాన్యం తాలుకు అస్తిత్వంలో లాభాల్లో మనకు ఉండే కీలక స్థాయి ననుసరించి కూలీలు జీతాలు గిట్టుబాటవుతాయి. వెనకట వ్యవసాయం ప్రధాన జీవనాధారం. అందుకని అది లేని నాకు నిన్ను యివ్వనన్నారు. ఇపుడది గిట్టుబాటు లేనిదైపోతున్నది. వెనకటి బట్టల మిల్లు కార్మిక రంగం దాని స్థానం బలంగా ఉన్నంతకాలం కూలీ బాగా గిట్టుబాటై ఆ కార్మికుల్లోంచే చిన్న పెట్టుబడిదారులు పుట్టి యిపుడు షోలాపూర్, భీవండి బట్టల మిల్లుల యజమానులయ్యారు. ఇపుడా అవకాశం లేదు. కంప్యూటర్ ఎలక్ట్రానిక్ రంగాలిపుడీ దశలో ఉన్నాయి. అందులో నిన్నటి ఉద్యోగుల్లోంచి నేడు వేల కోట్ల అధిపతులయ్యారు."

"వ్యాపారమైనా, వ్యవసాయమైనా సంపాయించేటోల్లు సంపాయిస్తల్లేరా! దొరలు వ్యవసాయం చేసి, ట్రాక్టర్లు కొని, కాంట్రాక్టర్లయి, పెద్దపెద్ద బిల్డింగులు కట్టుకోలేదా! దేనికైనా తెలివి కావాలె. సంపాయించింది పొదుపు చేసుకోవాలె. పెట్టుబడి పెట్టాలె. మా నాయన ఎనిమిదిమందిని వ్యవసాయం చేసుకుంటూ

గుత్తులు పట్టి ఇండ్లు కట్టుకుంటూ మమ్ములందర్ని సాదలేదా? ఎదగలేదా?" అంది మా ఆవిడ.

"అక్కా! నువ్వన్నది నిజమేగానీ, అందరు ఎదిగిన్రా?... నాయినా అవ్వా ఒక్కరేమిటి మా యీ పల్లెలో వ్యవసాయాన్ని నమ్ముకొని బతికినవాళ్ళున్నారు గానీ బాగుపడ్డవారు లేరు. వ్యవసాయాన్ని నమ్ముకుంటే తిండికి కొరత లేదు. కాని జంతువులు కూడా ఏదో తిని బతుకుతాయి". అంటూ నావైపు తిరిగి అంది సారవ్వ...

"మా మీద వేసే పన్నుల్తో అడ్డగోలు జీతాలు దొబ్బి మీరు సుఖాలనుభ విస్తున్నారు. మేమేమో వెనకబడి పోతున్నాం. ప్రభుత్వం మీ సౌఖ్యాల కోసమే పుట్టినట్టుంది. మా కోసమని పుట్టిన ప్రభుత్వం మీ సుఖాలు, సౌకర్యాలకి పరిమితమైపోయింది. అందుకే నువ్విట్లా ఎర్రగా బుర్రగా నునుపు తేలినావు. నీ పిల్లలు బాగా చదువుకొని ఎదుగుతున్నారు." అంది సరస్వతి.

అది నన్ను ఉద్దేశించిన మాటైనా మా ఆవిడ తననే అన్నట్టు ముఖం మాడ్చుకుంది.

"సరస్వతీ! ప్రజలందరూ నీలాగా నిలదీస్తే ప్రభుత్వం యిలా ఉండదు. ప్రభుత్వ ఉద్యోగులూ యిలా ఉండరు. వాళ్ళు ప్రజల గురించి నిజంగానే పట్టించుకుంటారు" అన్నాను.

అప్పగింతల కాడికి రమ్మన్నారంటూ తమ్ముడి కొడుకు రావడంతో ఫ్రెష్‌గా ముఖం, కాళ్ళు చేతులు కడుక్కున్నాను. అందరం బయల్దేరాము.

ఈ పెళ్ళిలో పెళ్ళి ఖర్చుల్లో ఏ బాధ్యతనూ నిర్వర్తించని నన్నూ, మా ఆవిడనూ దీవించమని కోరుతూ అన్నకూతురు కాళ్లుమొక్కి ఏడుస్తుంటే దుఃఖం వచ్చింది. వరుసలన్నీ మనిషికి తోటి మనిషిపై గల హక్కుల్తోపాటు వారిపట్ల నెరవేర్చాల్సిన బాధ్యతల్ని కూడా తెలుపుతాయి. ఈ పాత చుట్టాల పట్ల, వీరి అభివృద్ధి పట్ల నేను నెరవేర్చినదేమిటి అని మనస్సు బాధగా మూలిగింది.

రాత్రి భోంచేయమని ఎంత బతిమాలినా మా ఆవిడ "వద్దు ఇపుడే

పోదాం" అంది. సరస్వతి అంత పేదరికంలోనూ తృప్తిగా, నిండు వ్యక్తిత్వంతో జీవించడం మా ఆవిడకు అసూయగా ఉందనుకున్నాను.

"మనకన్నా వెనకబడిపోయిన వారిపట్ల సహృదయత, చేయూతనిచ్చే గుణం ఉండాలిగానీ అసూయ దేనికి" అని అనుకున్నాను.

ఇంటికి చేరాక అదే అడిగాను.

"పెళ్ళికాకముందు సరస్వతికీ నీకూ ఏదైనా సంబంధం ఉండేదా" అంటూ నిలదీసింది మా ఆవిడ.

నాకు నవ్వు వచ్చింది.

ఇన్నేళ్ళ సంసారం తర్వాత ఆమాట అడగడం నన్ను బాధించింది.

"నీక్కూడా నీ మేనబావల్తో అలాంటి సంబందాలుండేవా! ఎందుకట్లా అనుమానపడ్తావు" అన్నాను.

అంతే మా ఆవిడ వరసమారింది.

మరుసటిరోజు ఆమె తన పుట్టింటికి వెళ్ళిపోయింది.

**విపుల మాస పత్రిక, ఆగస్టు, 1999**

❄ ❄ ❄